1. శ్రీ కైవల్యపదంబుఁ జేరుటకునై చింతించెదన్, లోక ర
క్షైకారంభకు, భక్తపాలనకళా సంరంభకున్, దానవో
ద్రేకస్తంభకుఁ, గేళిలోల విలసద్దృగ్జాల సంభూత నా
నాకంజాతభవాండకుంభకు, మహానందాంగనా డింభకున్

తా॥ లోకాలనన్నింటినీ కాపాడటమే తన పనిగా పెట్టుకొన్నవాడు, భక్తులను సత్వరమే రక్షించేవాడు, రాక్షసుల విజృంభణాన్ని అణచేవాడు, ఈ జగన్నాటకం అనే ఆటమీది అమితాసక్తితో ప్రకాశించే చూపుల మాయవల్ల పుట్టిన బ్రహ్మాండాలను, కుండవలె తనలో ఇముడ్చుకున్నవాడు, ఎంతో గొప్పదైన నందగోపుని ఇల్లాలు యశోదాదేవికి ముద్దుబిడ్డడు అయిన శ్రీకృష్ణుని మహా భాగ్యమైన మోక్షాన్ని పొందటానికి స్మరిస్తాను.

2. పలికెడిది భాగవతమఁట!,
పలికించెడి వాఁడు రామభద్రుండఁట! నేఁ
బలికిన భవహరమగునఁట!,
పలికెద వేఱొండు గాథ పలుకఁగ నేలా?

తా॥ భగవంతుని కథను - భగవత్తత్త్వాన్ని శివుడైనా, బ్రహ్మదేవుడైనా పరిపూర్ణంగా తెలిసి చెప్పగలరా? చెప్పగలిగితే అది ఆశ్చర్యమే. విజ్ఞులవల్ల విన్నంత, నాకు గోచరించినంత, బోధపడినంత తేటతెల్లంగా చెపుతాను.

3. హరికిం బట్టపుదేవి, పున్నెముల ప్రో, వర్థంపుఁ బెన్నిక్క, చం
దురు, తోఁబుట్టువు, భారతీ గిరిసుతల్ తోనాడు పూఁబోఁడి, తా
మరలం దుండెడి ముద్దరాలు, జగముల్ మన్నించు నిల్లాలు, భా
సురతన్ లేములు వాపు తల్లి, సిరి యిచ్చున్ నిత్యకల్యాణముల్.

తా॥ శ్రీదేవి ఆదిదేవుడైన శ్రీమహావిష్ణువునకు పట్టపురాణి. ఆమె పుణ్యాలరాశి. సిరిసంపదలకు కాణాచి. క్షీరసాగర మథన సమయంలో చంద్రునితో కలిసి పుట్టింది. సరస్వతీ పార్వతులతో కలసి క్రీడించు అలరుబోడి. పద్మాల్లో నివసించే యౌవనవతి. సమస్త లోకాలవారు ఆమెనే పూజిస్తారు. ఒక్క చూపుతోనే దారిద్ర్యాన్ని పటాపంచలు చేసే తల్లి. ఆ ఆదిలక్ష్మి తనకు నిరంతరం సౌభాగ్యం అందజేయాలని పోతన కోరుతున్నాడు.

4. చేతులారంగ శివునిఁ బూజింపఁడేని,
నోరు నొవ్వంగ హరికీర్తి నుడువఁడేని
దయయు సత్యంబు లోనుగాఁ దలఁపఁడేనిఁ,
గలుగ నేటికిఁ దల్లుల కడుపుచేటు.

తా॥ ఈ లోకంలో పుట్టిన ప్రతివ్యక్తి చేతులారా శివుని పూజించాలి. నోరారా విష్ణువును కీర్తించాలి. దయను, సత్యాన్ని అంతరంగంలో నింపుకోవాలి. అలా చేయనివాడు పుట్టడం దేనికి? తల్లుల కడుపు చెడగొట్టుటకు తప్ప.

5. లా వొక్కింతయు లేదు; ధైర్యంబు విలోలంబయ్యెఁ; బ్రాణంబులున్
ఠావుల్ దప్పెను; మూర్ఛ వచ్చెఁ; దనువున్ డస్సెన్; శ్రమంబయ్యెడిన్,
నీవే తప్ప నితఃపరంబెఱుఁగ; మన్నింపందగున్ దీనునిన్,
రావే యీశ్వర! కావవే వరద!; సంరక్షింపు భద్రాత్మకా!

తా॥ భగవంతుడా! ఇక నా దేహంలో ఏ శక్తీ లేదు. ధైర్యం సన్నగిల్లిపోయింది. పంచప్రాణాలు సడలిపోతున్నాయి. మూర్ఛ వస్తోంది. శరీరం డస్సిపోయింది. బాగా అలసిపోయాను. నీవు తప్ప మరో దిక్కు నాకు లేదు. ఈ దీనుని క్షమించి ఆదుకో! దేవాధిదేవా! రావయ్యా! కోరిన వరాలిచ్చే దొరా! రక్షించవయ్యా!, పుణ్యాత్ముడా! నన్ను కాపాడవయ్యా!

6. విను దఁట జీవుల మాటలు చను దఁట చనరానిచోట్ల శరణార్థుల కో
యను దఁట పిలిచిన సర్వముఁగను దఁట సందేహ మయ్యెఁగరుణావార్ధీ!

తా॥ ఓ దయాసాగరా! ప్రాణులందరి మాటలూ వింటావంటారు. నీవు ప్రవేశించరాని చోటే లేదంటారు. శరణార్థులు పిలవగానే వెంటనే ‘ఇదిగో’ అని సమాధానమిస్తావంటారు. అన్నిటిని చూస్తూ ఉంటావట గదా! శాస్త్రాలు చెప్పే ఇవన్నీ నిజమేనా! అనే సందేహం కలుగుతోందయ్యా!

7. అల వైకుంఠపురంబులో నగరిలో నా మూలసౌధంబు దా
పల మందారవనాంతరామృతసరఃప్రాంతేందుకాంతోపలో
త్పలపర్యంకరమావినోది యగు నాపన్నప్రసన్నుండు వి
హ్వలనాగేంద్రము ‘పాహి పాహి’ యనఁగుయ్యాలించి సంరంభియై.

తా॥ ఆ సమయంలో ఎక్కడో వైకుంఠంలో అంతఃపురంలో ప్రధానమైన మేడ ఎడమ ప్రక్కన ఉన్న మందారవనంలోని 'అమృత' సరస్సున్న ప్రాంతంలో చంద్రకాంత శిలల అరుగుపై కలువలతో కూర్చిన పాన్పు మీద లక్ష్మీదేవితో వినోదిస్తున్నవాడు ఉండగా; భయంతో స్వాధీనం తప్పిపోయిన గజేంద్రుడు 'కాపాడు! కాపాడు!' అని మొరపెట్టగానే ఆ 'కుయ్యి' విని, దానిని కాపాడటానికి ఉత్సాహంతో, వేగంగా (సంరక్షణ కార్యాన్ని చేపట్టాడు).

8. సిరికిం జెప్పఁడు; శంఖచక్రయుగముం జేదోయి సంధింపఁడే
పరివారంబును జీరఁడభ్రగపతింబన్నింపఁడాకర్ణికాం
తరధమ్మిల్లముఁజక్క నొత్తఁడు వివాదప్రోత్థితశ్రీకుచో
పరిచేలాంచలమైన వీడఁడు గజప్రాణావనోత్సాహియై.

తా॥ గజరాజు ప్రాణాలను కాపాడాలన్న ఉత్సాహంలో శ్రీమహావిష్ణువు లక్ష్మీదేవికి ఒక మాటా చెప్పలేదు. శంఖచక్రాలను ధరించలేదు. సేవకులెవర్నీ పిలవలేదు. వాహనాన్ని సిద్ధం చేయుమనలేదు. చెవిలోని తామర దుద్దులదాకా జారిన జుట్టుముడిని చక్కదిద్దుకోలేదు. ప్రణయంతో వెళ్ళిపోతున్న లక్ష్మీదేవి పైట కొంగును కూడా విడిచిపెట్టలేదు.

9. తనవెంటన్ సిరి, లచ్చివెంట నవరోధవ్రాతమున్, దాని వె
న్కను బక్షీంద్రుఁడు, వాని పొంతను ధనుఃకౌమోదకీ శంఖ చ
క్ర నికాయంబును, నారదుండు, ధ్వజినీకాంతుండు రా వచ్చి రొ
య్యన వైకుంఠపురంబునం గలుగవా రాబాలగోపాలమున్.

తా॥ అలా స్వామి బయలుదేరగానే లక్ష్మీదేవి, ఆమె వెంట అంతఃపుర స్త్రీలు, వారి వెంట గరుత్మంతుడు, ఆయన ననుసరించి శంఖచక్రాదులగు ఆయుధ సమూహం; నారదమహర్షి, సేనాపతి విష్వక్సేనుడు రాగా, వైకుంఠంలోని అందరూ వారివెంట వరుసగా బయలుదేరి వచ్చారు.

10. కామోత్కంఠత గోపికల్ భయమునం గంసుండు వైరక్రియా!
సామగ్రిన్ శిశుపాల ముఖ్య నృపతుల్ సంబంధులై వృష్ణులున్!
ప్రేమన్ మీరలు భక్తినే మునిదె చక్రిం గంటిమెట్లైనను!
ధ్యామధ్యాన గరిష్ఠుడైన హరిజెందన్ వచ్చు ధాత్రీశ్వరా!

తా॥ కామం చేత గోపికలు, మృత్యుభయం చేత కంసుడు, వైరముతో శిశుపాలుడు, బాంధవ్యం చేత వృష్టులు, ప్రేమతో పాండవులు, భక్తితో నారదుడు మొదలైన మునులు నారాయణుని సదా స్మరించి ధన్యులయ్యారు. శ్రీహరి కరుణ పొందుటకు కామం, ప్రేమ, వైరం కూడా మార్గాలే. ఆ దేవదేవుడికి స్మరణ, ప్రార్థన ముఖ్యంగానీ, ఎలా స్మరించాడన్నది ముఖ్యంగాదు.

11. మందార మకరంద మాధుర్యమునఁ దేలు
    మధుపంబు వోవునే మదనములకు
నిర్మల మందాకినీ వీచికలఁ దూగు
    రాయంచ చనునే తరంగిణులకు
లలితరసాలపల్లవ ఖాదియై చొక్కు
    కోయిల సేరునే కుటజములకుఁ
బూర్ణేందు చంద్రికాస్ఫురిత చకోరక
    మరుగునే సాంద్రనీహారములకు
అంబుజోదర దివ్యపాదారవింద
చింతనామృతపాన విశేషమత్త
చిత్త మేరీతి నితరంబుఁ జేరనేర్చు
వినుతగుణశీల! మాటలు వేయునేల?

తా॥ మందార పువ్వుల్లోని మకరందంలో తేలే తుమ్మెద ఉమ్మెత్త పూలకు పోతుందా? నిర్మలమైన గంగానది వీచికలకు అలవాటుపడిన రాజహంస సాధారణ ఏటిగట్టుకు వెళుతుందా? లలితమైన మావి చిగుర్లు తిని మత్తుగా కూసే కోయిల ఎడారి చెట్లకు పోతుందా? వెన్నెలను ఆరగించే చకోర పక్షి మంచునాశిస్తుందా? అలాగే ఎప్పుడూ శ్రీమహావిష్ణువు పాదారవిందాలను ధ్యానించే నా మనస్సు ఇతరములవైపు ఎలా వెళ్ళగలదనుకున్నావు తండ్రీ! ఎందుకిన్ని మాటలు? నా మనసెప్పుడూ శ్రీహరి సన్నిధినే ఆశ్రయిస్తుంది.

12. కమలాక్షు నర్చించు కరములు కరములు
    శ్రీనాథు వర్ణించు జిహ్వ జిహ్వ
సురరక్షకునిఁ జూచు చూడ్కులు చూడ్కులు

శేషశాయికి మ్రొక్కు శిరము శిరము
విష్ణు నాకర్ణించు వీనులు వీనులు
మధువైరిఁ దవిలిన మనము మనము
భగవంతు వలగొను పదములు పదములు
పురుషోత్తముని మీఁది బుద్ధి బుద్ధి
దేవదేవుని చింతించు దినము దినము
చక్రహస్తునిఁ బ్రకటించు చదువు చదువు
కుంభినీధవుఁ జెప్పెడి గురుఁడు గురుఁడు
తండ్రి హరిఁజేరు మనియెడి తండ్రి తండ్రి.

తా॥ తామరపూవు రేకుల వంటి కన్నులు గల శ్రీమహావిష్ణువును పూజించు చేతులే చేతులు, లక్ష్మీపతిని పొగిడే నాలుకే నాలుక, శ్రీహరి స్వరూపాన్ని చూడగలిగిన కనులే కనులు, ఆదివిష్ణువుకు మ్రొక్కిన శిరస్సే శిరస్సు, సదా హరికథలు వినే చెవులే చెవులు, మాధవుని తలచిన మనస్సే మనస్సు, భగవంతుని వైపు వేసే పాదాలే పాదాలు, పురుషోత్తమునిపై లగ్నమైన బుద్ధే బుద్ధి, ఆ దేవదేవుని ప్రార్థించిన దినమే దినము, చక్రధారుని వివరించే చదువే చదువు, విష్ణు మహిమను చెప్పే గురువే గురువు, హరిని ఆశ్రయించమని బోధించే తండ్రే తండ్రి అంటున్నాడు ప్రహ్లాదుడు తన తండ్రితో.

13. కంజాక్షునకుఁ గాని కాయంబు కాయమే
పవనగుంభిత చర్మభస్త్రి గాక
వైకుంఠుఁ బొగడని వక్త్రంబు వక్త్రమే
ఢమఢమ ధ్వనితోడి ఢక్కగాక
హరిపూజనము లేని హస్తంబు హస్తమే
తరుశాఖ నిర్మిత దర్విగాక
కమలేశుఁ జూడని కన్నులు కన్నులే
తనుకుడ్యజాల రంధ్రములుగాక
చక్రిచింతలేని జన్మంబు జన్మమే
తరళసలిల బుద్బుదంబు గాక

విష్ణుభక్తిలేని విబుధుండు విబుధుఁడే
పాదయుగముతోడి పశువుగాక.

తా॥ విష్ణుసేవకు వినియోగించని శరీరము కమ్మరివాని తోలుతిత్తి లాంటిది. వైకుంఠవాసుని పొగడని నోరు ఢమ ఢమమని వాయించే ఢక్కలాంటిది. శ్రీహరి పూజ చేయని చేతులు కర్ర తెడ్లు లాంటివి. శ్రీమహావిష్ణువును చూడని కన్నులు ఇంటికి పెట్టిన కిటికీల లాంటివి. చక్రధారి స్మరణ లేని జన్మ నీటిబుడగ లాంటిది. విష్ణుభక్తి లేని మానవుడు ద్విపాద పశువుతో సమానం.

14. ఇందు గలఁ డందు లేఁడని
సందేహము వలదు చక్రి సర్వోపగతుం
డెందెందు వెదకి చూచిన
నందందే గలఁడు దానవాగ్రణి, వింటే!

తా॥ ఓ దానవేశ్వరా! శ్రీహరి ఇక్కడ ఉన్నాడు, అక్కడ లేడు అనే సందేహం వద్దు. ఆయన అంతటా ఉన్నాడు. ఎక్కడ వెదకి చూచినా అక్కడే ప్రత్యక్షం కాగలడు.

15. ఎవ్వనిచే జనించు జగ మెవ్వని లోపల నుండు లీనమై
యెవ్వనియందు డిందుఁ బరమేశ్వరుఁ డెవ్వఁడు మూలకారణం
బెవ్వఁ డనాదిమధ్యలయుఁ డెవ్వఁడు సర్వము దానయైనవా
డెవ్వఁడు వాని నాత్మభవు నీశ్వరు నే శరణంబు వేడెదన్.

తా॥ ఈ జగత్తు ఎవ్వరివల్ల సృష్టించబడుతోందో, ఎవరిలో లీనమై ఉందో, ఎవరు అన్నిటికీ ప్రభువో, సృష్టి, స్థితి, లయలకు ఎవరు కారణమో, ఎవరికి ఆది, మధ్య, అంతం లేదో, ఎవరు సర్వాత్ముడో, అట్టి దేవున్ని ప్రార్థిస్తున్నాను.

16. ఇంతింతై వటుఁ డింతయై, మరియు దానింతై నభోవీధిపై
నంతై, తోయదమండలాగ్రమున కల్లంతై, ప్రభారాశిపై
నంతై, చంద్రుని కంతయై, ధ్రువునిపై నంతై, మహర్వాటిపై
నంతై, సత్యపదోన్నతుండగుచు బ్రహ్మాండాంత సంవర్ధియై.

తా॥ బలి మూడు అడుగుల భూమి ఇవ్వగానే వామనమూర్తి తన

విరాడ్రూపం ధరిస్తున్న చిత్రం ఇందులో కనిపిస్తుంది. ఇంతింతై, ఇంతింతై క్రమేణా పెరిగి చివరికి బ్రహ్మాండమంతా ఆక్రమించాడు వామనుడు.

17. **హారికి నందగోకులవిహారికిఁ జక్రసమీరదైత్య సం**
**హారికి, భక్తదుఃఖపరిహారికి, గోపనితంబినీ మనో**
**హారికి, దుష్టసంపదపహారికి, ఘోషకుటీపయోమృతా**
**హారికి, బాలకగ్రహమహాసురదుర్వనితాప్రహారికిన్.**

తా॥ మనోహర హారాలు ధరించువాడికి, నందవంశం వారి గోకులంలో విహరించినవాడికి, తృణావర్తుడనే దానవుణ్ణి సంహరించినవాడికి, భక్తుల పరితాపాలను పరిహరించువాడికి, గోపకాంతల మనసుని దొంగిలించే మహనీయుడికి, గొల్లభామలు ఇళ్ళలో దాచుకున్న పాలు నెయ్యి దొంగిలించిన వెన్న దొంగకు, పిల్లల పాలిట పెనుభూతమైన పూతన అనే మహారాక్షసిని మట్టుపెట్టిన వాడికి ఈ నా కావ్యం అంకితం చేస్తున్నాను.

18. **చిత్రంబులు త్రైలోక్య, పవిత్రంబులు భవలతాలవిత్రంబులు స**
**న్మిత్రంబులు మునిజనవన, చైత్రంబులు విష్ణుదేవుచారిత్రంబుల్.**

తా॥ శ్రీమహావిష్ణువు చరిత్రలు కేవలం విచిత్రాలు మాత్రమే కావు. ముల్లోకాలను పవిత్రం చేసేటటువంటివి. జీవరాసులకు మంచిమిత్రుల వంటివి. అడవులకు వసంత ఋతువు ఆనందం కలిగిస్తుంది. అదేవిధంగా ఈ చరిత్రలు మునులకు ఆనందాన్ని కలిగిస్తాయి. ఇవి సంసారబంధం అనే లతలను ఛేదించే కొడవలి వంటివి అని శుకమహర్షి పరీక్షిత్తుకు వివరించాడు.

19. **తన్ను నిశాచరుల్ వొడువ దైత్యకుమారుడు మాటిమాటికో**
**పన్నగశాయి! యోదనుజభంజన! యోజగదీశ! యోమహా**
**పన్నశరణ్య! యోనిఖిలపావన! యంచు నుతించు గాని తాఁ**
**గన్నుల నీరు తేడు భయకంప సమేతుడు కాడు భూవరా!**

తా॥ ఓ ధర్మరాజా! ఇలా రాక్షసులు తనను ఎంత క్రుమ్మినా, ప్రహ్లాదుడు మాటిమాటికీ "ఓ శేషశయనా! ఓ రాక్షసాంతకా! ఓ లోకనాయకా! ఓ దీనరక్షాకరా! ఓ సర్వపవిత్రా!" అని రకరకాలుగా భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాడు తప్పించి,

కన్నీళ్ళు పెట్టడం లేదు, ఏ మాత్రం భయపడటం లేదు, కనీసం జంకటం లేదు.

20. పాఱఁడు లేచి దిక్కులకు; బాహువులొడ్డఁడు; బంధురాజిలోఁ
దూఱఁడు; ఘోరకృత్యమని దూఱఁడు; తండ్రిని మిత్రవర్గముం
జీరఁడు; మాతృసంఘము వసించు సువర్ణగృహంబులోనికిం
దాఱఁడు; కావరేయనఁడు తాపము నొందఁడు; కంటగింపఁడున్.

తా॥ ఆ రాక్షసులు ఎంత హింసిస్తున్నా ప్రహ్లాదుడు దూరంగా పారిపోడు; కొడుతుంటే చేతులు అయినా అడ్డం పెట్టుకోడు; చుట్టాల గుంపులోకి దూరి దాక్కోడు; ఇది 'ఘోరం, అన్యాయం' అని తండ్రిని నిందించడు; స్నేహితులను సాయం రమ్మనడు; తన తల్లి, సవితి తల్లి మున్నగు తల్లులు నివాసం ఉండే బంగారు మేడలలోనికి పరుగెట్టి, 'కాపాడండి' అని గోలపెట్టడు; అసలు బాధపడనే పడడు; వేదన చెందడు. తండ్రిని గాని, బాధిస్తున్న రాక్షసులను కాని, అసహాయంగా చూస్తున్న వారిని కానీ ఎవరినీ ద్వేషింపడు; ఎంతటి విచిత్రం, ఇలాంటి పిల్లవాడు ఎక్కడైనా ఉంటాడా?

21. చిక్కడు వ్రతముల క్రతువుల
జిక్కడు దానముల శౌచశీలతనములం
జిక్కడు యుక్తిని, భక్తిని
జిక్కిన క్రియ నచ్యుతుండు సిద్ధము సుండీ.

తా॥ మిత్రులారా! ఆ భగవానుడు గాఢమైన భక్తికి చిక్కినట్లుగా దానవ్రతాలకూ, శౌచశీలాలకూ, జపతపాలకూ, యజ్ఞయాగాలకూ, నియమ నిష్ఠలకూ చిక్కడు. భక్తి ఒక్కటే ఆ స్వామిని పొందే సాధనం. మరొక మార్గం లేదు అని ప్రహ్లాదుడు అన్నాడు.

22. సంసారజీమూతసంఘుంబు విచ్చునే?
చక్రిదాస్య ప్రభంజనము లేక;
తాపత్రయాభీల దావాగ్నులాఱునే?
విష్ణుసేవామృత వృష్టి లేక;

సర్వం కషాఘౌష జలరాసు లింకునే?
హరిమనీషా బడబాగ్ని లేక;
ఘన విపద్గాఢాంధకారంబు లడగునే?
పద్మాక్షు నుతి రవిప్రభలు లేక;
నిరుపమ పునరావృత్తి నిష్కళంక
ముక్తినిధిఁ గానవచ్చునే? ముఖ్యమైన
శార్ఙ్గ కోదండ చింతనాంజనము లేక
తామరసగర్భునకు నైన దానవేంద్ర!

తా॥ రాక్షసులారా! గుంపులు కట్టిన కారుమబ్బులు పెద్ద గాలి ప్రభంజనంలా విసరకపోతే విడిపోవు కదా! అలాగే చక్రధారి అయిన విష్ణుమూర్తి సేవ లేకుండా సంసారబంధాలు తొలగిపోవు. శ్రీహరి కైంకర్యం అనే అమృతపు వానజల్లు కురవకపోతే, సంసారాటవిలో చెలరేగే తాపత్రయాలు అనే భయంకరమైన దావాగ్ని చల్లారదు. బడబాగ్ని ప్రజ్వల్లితే సముద్రాలు కూడా ఇంకిపోతాయి. అలాగే శ్రీపతి చింతన ఉత్తేజమైతే సముద్రంలాగ అంతటా ఒరుసుకుంటూ ఉండే పాపాలన్నీ పటాపంచలైపోతాయి. సూర్యుని కిరణాలు తాకితే ఎంతటి చీకటి తెరలైనా విడిపోతాయి. అలాగే కేశవ కీర్తనతో ఎంతటి విపత్తులు చుట్టుముట్టినా విరిగిపోతాయి. మహానిధులు గుప్తంగా ఉంటాయి. అంజనం ఉంటే వాటిని కనుగొనగలం. విష్ణుభక్తి అనే అంజనం ఉంటే కాని నిర్మలమైన, నిరుపమానమైన, పునర్జన్మ లేని ముక్తి అనే పెన్నిధి అందుకోవడం ఎవరికీ సాధ్యం కాదు. తండ్రీ! ఆఖరికి ఆ బ్రహ్మదేవునికి అయినా సరే ఇది తప్ప మార్గాంతరం లేదు.

23. కలడంబోధిఁ గలండు గాలిఁ, గలడాకాశంబునం, గుంభినిం
గల, డగ్నిన్ దిశలం బగళ్ళ నిశలన్ ఖద్యోత చంద్రాత్మలం
గల, డోంకారమునం త్రిమూర్తుల త్రిలింగవ్యక్తులం దంతటం
గల, డీశుండు కలండు, తండ్రీ! వెదుకంగా నేల నీయాయెడన్.

తా॥ ప్రకృతిలో పరమాత్మలేని ప్రదేశం లేదని నిర్ద్వంద్వంగా చెప్పే పద్యమిది. ఆకాశంలో, సముద్రంలో, అగ్నిలో, అవనిలో, అన్ని దిశలలో ఉన్నాడా

భగవంతుడు. ఓంకారంలో, ఆదిత్యునిలో, రాకా చంద్రునిలో, త్రిమూర్తులలో, స్త్రీ పురుషులలో ఉన్నాడు. అసలు ఆ మహాత్ముడు లేని ప్రదేశం లేదు. అణువణువులో వెలసి ఉన్నాడు పరమాత్ముడని, అతనిని వెదకవలసిన పని లేదని ప్రహ్లాదుని ఉవాచ.

24. బలయుతులకు దుర్బలులకు
బల మెవ్వఁడు? నీకు నాకు బ్రహ్మాదులకున్
బల మెవ్వఁడు ప్రాణులకును
బల మెవ్వం డట్టి విభుఁడు బల మసురేంద్రా!

తా॥ రాక్షసరాజా! బలవంతులకు, బలహీనులకు, నీకు, నాకు, బ్రహ్మ మొదలగు వారికి, సృష్టిలోని సర్వప్రాణులకు అందరికీ శరణు అయినవాడు ఎవరో, ఆ పరాత్పరుడే నాకు అండగా ఉన్నాడు.

25. హరికిం పట్టపుదేవివి
హరిసేవా నిపుణమతివి హరిగతివి సదా
హరి రతివి నీవు సని నర
హరి రోషము డింపవమ్మ హరివరమద్యా!

తా॥

26. మ్రింగెడివాడు విభుండని
మ్రింగెడిది గరళమనియు మేలని ప్రజకున్
మ్రింగమనె సర్వమంగళ
మంగళ సూత్రంబు నెంత మది నమ్మినదో!

తా॥ మింగుతున్నది తన భర్తని తెలిసి, మింగేది విషమని తెలిసి, ప్రజలందరికీ మేలు జరగుతుంది కాబట్టి సర్వమంగళ అయిన పార్వతి తన మంగళ సూత్రమును నమ్మి విషమును మింగమని చిరునవ్వుతో తన అంగీకారాన్ని చెప్పగలిగింది.

27. రవిబింబం బుపమింప భాత్రమగు ఛత్రంబై శిరోరత్నమై
శ్రవణాలంకృతమై గళాభరణమై సౌవర్ణ కేయూరమై

చవిమత్కంకణమై కటిస్థలి మదంచధఘట్టమై నూపుర
ప్రవరంబై పదపీఠమై వటుండు దా బ్రహ్మాండమున్ నిండుచోన్.

తా॥ సూర్యబింబం స్థిరమయినది, వామనుడు పెరిగిపోవడం మొదలు పెట్టాడు. సూర్యబింబం మొదట గొడుగయినది, ఆభరణమయినది, అలా అలా భుజకీర్తులయి, కంకణము, మెడలో గంట, చివరగా పదముల క్రింద పీటగా మారిపోయినది. ఆవిధంగా వామనుడు బ్రహ్మాండమంతటా నిండిపోయాడు.